

## గ్రామసభకు కట్టుదిట్టమైన భద్రత : ఎస్‌పి

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

మండలంలోని మైసూరువారిపల్లెలో ఈ నెల 23న జరగనున్న గ్రామసభకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం గ్రామసభ నిర్వహించబోయే ప్రాంగణాన్ని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. గ్రామసభ నిర్వహించబోయే ప్రాంగణాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి తగిన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టా గుండయ్యానాయుడు, తాతశెట్టి నాగేంద్ర, గడికోట సుబ్బరాయుడు, పగడాల చంద్రశేఖర్, తిమ్మిశెట్టి మణి, వెంకటేష్, జోగినేని మణి, రవికుమార్‌రాజు, సుబ్బి రామిరెడ్డి, తిరుపాల్, రాజశేఖర్, సిఐలు వెంకటేశ్వర్లు, బాబు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

# వరద బాధితులకు పూర్తి న్యాయం చేస్తాం

### నష్టపోయిన గ్రామాలలో రీ సర్వే చేయిస్తాం కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**


2021 నవంబర్‌లో హుదూద్ తుఫాను కారణంగా అన్నమయ్య డ్యామ్ తెగి నష్టపోయిన ప్రతి వరద బాధితులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని, దెబ్బతిన్న ఐదు గ్రామాలలో రీ సర్వే చేపడతామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం వరద ప్రభావిత ప్రాంతాలైన పులపత్తూరు గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పులపత్తూరు, దళితవాడల్లో పర్యటించి వరదలలో దెబ్బతిన్న ప్రాంతాలను, ఇళ్లను, గ్రామ సమీపంలోని చెయ్యేరు పరివాహక ప్రాంతాన్ని, ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ బాధితులు ఎంతమంది, నష్టపరిహారం ఎంతమందికి అందింది, పునరావాసం నిమిత్తం ఎన్ని ఇళ్ల మంజూరు చేశారు, పూర్తి అయిన ఇండ్లు ఎన్ని, ప్రగతిలో ఉన్న నిర్మాణాలు ఎన్ని, ఇంటి బిల్లుల చెల్లింపు, వ్యవసాయ, ఉద్యానవన పంటల పరిహారం మంజూరు, రోడ్లు, నీటి సౌకర్యం తదితర అంశాలలో స్థానిక గ్రామస్తులు, అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను కలెక్టరుకు విన్నవించారు. ప్రజల సమస్యలను ఓపికగా, సావధానంగా ఆలకించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చి ఆదేశాలు జారీ చేశారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించి తమకు పూర్తి స్థాయి ఆర్థిక సాయం అందలేదని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ప్రతి లబ్ధిదారుకు సంబంధించి ఎంత డబ్బు మంజూరు అయింది, ఇప్పటివరకు ఎంత మొత్తాన్ని వారి ఖాతాలలో జమ చేశారు, ఇంకెంత బిల్లు రావాల్సి ఉంది, ఏ కారణంగా పెండింగ్ లో ఉంది, అలాగే ఇంటి నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు ఎన్ని సిమెంట్ బస్తాలు ఇచ్చారు, ఎంత స్టీల్ ఇచ్చారు తదితర అన్ని విషయాలతో ఐదు గ్రామాలలో గ్రామ సచివాలయంలో లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు సంబంధించి అందిన పరిహారం, మంజూరు చేసిన భూమి వివరాలను కూడా లబ్ధిదారు వారీగా సచివాలయంలో ప్రదర్శించడంతో పాటు సదరు లబ్ధిదారుకు వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అన్నమయ్య ప్రాజెక్టు వరదల కారణంగా దెబ్బతిన్న ఐదు గ్రామాలలో రీ సర్వే చేయించి ఇంకా నష్టపరిహారం అందాల్సిన బాధితులు ఎవరైనా ఉంటే నమోదు చేస్తామని తెలిపారు. వివిధ అంశాలలో నష్టపోయిన బాధితులకు ఇంకను ఏదేని పరిహారం అందాల్సి ఉంటే ప్రభుత్వానికి నివేదించి పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు స్పష్టం చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు పరిధిలో వరదల ద్వారా దెబ్బతిన్న ప్రాంతమైన పులపత్తూరు గ్రామాన్ని ఈనెల 23న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సందర్శించే అవకాశం ఉందని, ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు అన్నింటిని పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ,పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి, టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు, హౌసింగ్ పీడీ శివయ్య, తహశీల్దార్, ఎంపిడిఒ హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్, పిఆర్ మండల స్థాయి ఇంజినీరింగ్ అధికారులు, గ్రామ సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

### విద్యుదాఘాతంతో
# విద్యార్థి దుర్మరణం

- మరో విద్యార్థికి గాయాలు
- డిష్ వైరుకు విద్యుత్ సరఫరాతోనే ప్రమాదం
- పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యుత్ ఎస్ఇ, డిఇఒ
- సంఘటనపై మంత్రి లోకేష్ ఆరా



విద్యుత్ ప్రమాదానికి గురవుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-కడప**

కడప నగరంలోని బెల్లం మండి వీధిలో ఇంటర్నేషనల్ కల్యాణ మండపం (టైటానిక్ బిల్డింగ్) వద్ద బుధవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది.విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. బెల్లం మండి వీధికి చెందిన అబ్దుల్ రహిమాన్ పెద్ద కుమారుడు బురేషి తంజువుర్ రహిమాన్ (11), ఆటో డ్రైవర్ అజ్మత్ అలీ కుమారుడు షేక్ ఆద్నాం అనే విద్యార్థులు ఇంటి సమీపంలోని విద్యాసాగర్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ రోజూ సైకిల్‌పై పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. రోజులాగానే మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం సైకిల్‌పై పాఠశాలకు బయలు దేరారు. వీరు టైటానిక్ బిల్డింగ్ సమీపంలోకి రాగానే రోడ్డుపై తెగిపడిన కేబుల్ వైరు సైకిల్ వెనుక చక్రానికి తగిలింది. ఆ కేబుల్ వైరుకు సపోర్టుగా ఉన్న జిఐ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై మంటలు రేగాయి. ప్రమాదంలో ఇద్దరూ కిందపడి గాయాలపాలయ్యారు.



మృతిచెందిన రహిమాన్



చికిత్స పొందుతున్న ఆద్నాం

వెంటనే స్థానికులు స్పందించి చెక్కతో విద్యార్థులను పక్కకు తీశారు. అప్పటికే తన్వీర్ మృతిచెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తన్వీర్ అనే విద్యార్థి మృతిచెందాడు. మరో బాలుడు ఆదాంను చికిత్స నిమిత్తం హోలిస్టిక్ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ సిఐబి. నాగార్జున, ఎస్ఐ ఎస్.కె.ఎం. హుసేన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యుత్ ఎస్ఇ, డిఇఒ**

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవి, విద్యుత్ ఎస్ఇ రమణ, డిఇఒ అనురాధ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, విద్యుత్ ఎస్ఇ మాట్లాడుతూ ఈ సంఘటన విద్యుత్‌శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల జరగలేదన్నారు. డిష్ ఆపరేటర్ నిర్లక్ష్యం వల్లే చోటు చేసుకుందన్నారు. ఇష్టానుసారంగా ఎలాంటి అనుమతి లేకుండా డిష్ వైర్లు విద్యుత్ స్తంభాలకు కట్టడం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని పేర్కొన్నారు. డిష్‌వైర్లకు సపోర్టుగా జి వైరు కట్టడం, అవి పాతడి కావడంతో రోడ్డుపై తెగిపడ్డాయని, విషయం గమనించ విద్యార్థులు సైకిల్‌పై వెళ్తుండగా వెనుక టైర్‌కు జి వైర్ తగిందన్నారు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో ట్రిప్ అయ్యి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదం చోటుచేసుకుందని ఎస్ఇ స్పష్టం చేశారు. సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామన్నారు. స్పెష్ట డ్రైవ్ ఏర్పాటు చేసి అడ్డదిడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలపై ఉన్న వైర్లను తొలగించాలని ఎమ్మెల్యే ఎస్‌ని ఆదేశించారు.

**సంఘటనపై విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆరా ..**

విద్యుదాఘాతం సంఘటన తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. మృతిచెందిన బాలుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు.

# ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పును నిలుపుదల చేయాలి

**రాజంపేట అర్బన్ :**ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాలలు చేపట్టిన భారత్ బంద్ రాజంపేటలో ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌కు సహ కరించి పాఠశాలలకు సెలవు ప్రకటించాయి. బంద్‌లో అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పొలంరెడ్డి మల్లిఖార్జున, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ, జిల్లా అధ్యక్షులు కొమ్మ ఎల్లయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదిరిగాళ్ల శాంతయ్య, మాల మహానాడు రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు ఇరువురి శివయ్య, జై భారత్ నాయకులు పందికాళ్ళ జయరాం, ఎస్ఎస్‌డి నాయకులు శెట్టిపల్లి శేఖర్ పాల్గొన్నారు.**బి.కొత్తకోట :** ఎస్‌సివర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో తలపెట్టిన భారత్ బంద్ బి.కొత్తకోటలో ప్రశాంతంగా ముగిసింది. బంద్‌లో మాల మహానాడు నాయకులు దార్ల నరసింహులు, హరికృష్ణ, శ్రీరాములు, విశ్వనాథ్, సురేంద్ర, రామంజులు, సలాడి రామాంజులు, సంకు శంకర పాల్గొన్నారు.**పీలేరు:** భారత్ బంద్ పీలేరులో పాక్షికంగా జరిగింది. మాలమహానాడు మండల ఉపాధ్యక్షులు బద్దె భాను ప్రకాష్, యువ నాయకులు జెట్టి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహనికి పూల మాల వేసి నివాళులార్పించి, "వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు" అంటూ నినాదాలు చేస్తూ అక్కడి నుంచి మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.



రామసముద్రం : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

**మదనపల్లె అర్బన్ :** ఎస్‌సి వర్గీకరణకి వ్యతిరేకిస్తూ భారత బంద్‌లో భాగంగా మదనపల్లిలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమలా సుదర్శనం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ యమల చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గుండా మనోహర్, జిల్లా అధికార ప్రతినిధి మోహన్, డివిజన్ అధ్యక్షులు లక్ష్మీపతి, జిల్లా నాయకులు మోహన్, గ్యాస్ చంద్ర, రమణ, రామచంద్ర పాల్గొన్నారు.**కలకడ:** మండల కేంద్రమైన కలకడలో భారత బంద్ లో భాగంగా మాల మహానాడు మాల మహానాడు ఐక్యవేదిక అధిష్టానం మేరకు ధర్నా రాస్తారోకో బంద్ నిర్వహించారు. కార్య క్రమంలో ఎన్‌పి నాగన్న, ఓబులేసు, నటరాజ, ఆంజనేయులు, మండలంలోని మాలలు పాల్గొన్నారు.**రామసముద్రం :** ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం మాలమహానాడు మండల అధ్యక్షులు క్రిష్ణప్ప, సమతా సైనిక దళ్ ప్రెసిడెంట్ జయరాజ్, ఆధ్వర్యంలో మాలలు చేపట్టిన భారత్ బంద్ రామసముద్రంలో ప్రశాంతంగా ముగిసింది. **నందలూరు:** ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘ సమితి పిలుపుమేరకు నందలూరులో భారత్ బంద్ ను దళిత వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు, స్కూల్ బంద్ శాంతియుతంగా నిర్వహించారు. అ కార్యక్రమంలో మోడపోతుల రాము, సూర్యనారాయణ, పెనుబాల నాగ సుబ్బయ్య, కాకి చంద్ర, మోడపోతుల సుధాకర్,ఎముక దుర్గయ్య, సురేష్, తుమ్మాది శివ కుమార్, బలరాం, శివ నరసింహులు పాల్గొన్నారు.

# మానవ మృగాలను ఉరితీయాలి

**ప్రజాశక్తి-రాయచోటి**

కలకత్తా ఆర్జీకార్ ఆస్పత్రి వైద్య విద్యార్థినిపై అత్యాచారం హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్రచట్టం చేయాలని, అత్యాచార నిందితులను, నిందితులను కాపాడాలనుకే వారికి కఠిన కారాగార శిక్ష విధించాలని, దేశంలో అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపులు నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని నినాదాలు ఇచ్చారు. ఈ ధర్నాని ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నలలో స్పష్టమైందని తెలిపారు. ఆస్పత్రిలో జరుగుతున్న ఘోరాలు బయటికి రాకూడదనే ఉద్దేశపూర్వకంగానే వైద్య విద్యార్థిని హతమార్చడం కోసం అత్యాచారం చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ఆసుపత్రిపై మూక దాడిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులను, దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిర్భయ ఘటన తర్వాత కూడా వేలమంది మహిళలపై అత్యాచారాలు కొనసాగుతున్నాయని, ఈ ఘటనలకు పురుషాధిక్యత కలిగిన భావజాలం కారణంగా నిలుస్తుందని అన్నారు.మహిళలు ఇంటికే పరిమితం అవ్వాలి, ఇలాంటి బట్టలు ఎందుకు వేసుకోవాలి, ఆ సమయానికి అక్కడ ఎందుకు ఉండాలి అనే ప్రశ్నలు విధించే వారందరిదీ అత్యాచార నిందితుల మనస్తత్వాలతో సరిపోలుతుందని తెలిపారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బివి.రమణ, హమాలీ సంఘం నాయకులు మాధవయ్య మాట్లాడుతూ బిల్ కేస్ భాను కేసులో అత్యాచార నిందితులను విడుదల చేసి సన్మానించిన ఘనత బిజెపి నాయకులకే చెందుతుందని, దేశానికి వన్నెతెచ్చిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడింది కూడా బిజెపి నాయకులేనని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఎన్ని చట్టాలు చేసినా అమలు చేసే రాజకీయ నాయకుల మెదళ్లలో విష పూరిత ఆలోచనలు ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారతాయని అన్నారు. అత్యాచార రహిత భారత దేశాన్ని సాధించాలంటే పురుషాధిక్య మతోన్మాద భవజాలంపై నిత్య పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు వి.సిద్దమ్మ, నాయకులు విజయమ్మ, శంకరమ్మ ,సుహాషిణి, హాజీరా, వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** డాక్టర్ మౌమితపై అమానుషంగా దాడిచేసి చిత్రహింసలు పెట్టి హత్యాచారం చేసిన మానవమృగాలను ఉరి తీయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, జనవిజ్ఞాన వేదిక నాయకులు హరిశర్మ డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనను వ్యతిరేకిస్తూ బుధవారం మదనపల్లెలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో పేషంట్లకు సేవచేసి డ్యూటీ ముగించుకొని విశ్రాంతి తీసుకుంటున్న డాక్టరు మౌమితపై కొందరు దుండగులు అమానుషంగా డాడిచేసి, అతి కిరాతకంగా హింసించి, ఘోరంగా మానభంగంచేసి హత్యచేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో క్షమించరాదన్నారు. మానవత్వాన్ని మరచి రాక్షసంగా ప్రవర్తించిన వీరిని కనుమరుగుచేసి ఎవరో ఒకరిపై నెపం మోపి నేరాన్ని తక్కువ చేసిచూపే ప్రయత్నాన్ని ఖండించారు. పోస్టుమార్టం రిపోర్టులో డాక్టరుపై అత్యాచారం చేసి, ఎముకలు విరిచి, ముఖాన్ని విపరీతంగా గాయపరచి తీవ్ర రక్తస్రావానికి గురిచేసినట్లు ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నంచేయడం దారుణమని వాపోయారు. ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా నేరస్థులను వెంటనే శిక్షించాలని, పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించాలని, మహిళలకు బాలికలకు రక్షణ కల్పించాలని కోరారు. కేంద్రంలో ఎన్‌డి ప్రభుత్వం వచ్చాక మహిళలకు రక్షణ కరవైందని, చట్టాలను తుంగలో తొక్కి నేరస్థులకు కొమ్ము కాస్తున్నందున వారికి భయం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరవకపోతే ప్రజల ఆగ్రహానికి గురవడంతో పాటు ఉవ్వెత్తున ప్రజా ఉద్యమం ఎగిసిపడుతుందని హెచ్చరించారు. నిరసనలో ఐద్వా పట్టణ నాయకులు షహీనా, రెడ్డిప్రసన్న, ఉషారాణి, లక్ష్మి, కమలమ్మ, భాను పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. కలకత్తా ఆర్జీకార్ ఆస్పత్రి వైద్య విద్యార్థినిపై అత్యాచారం హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రైల్వే కోడూరు టోల్గేట్ గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, అత్యాచార నిందితులను, నిందితులను కాపాడాలనుకే వారికి కఠిన కారాగార శిక్ష విధించాలని,దేశంలో అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపులు నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని నినాదాలు ఇచ్చారు. బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నలలో స్పష్టమైందని తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్న ఘోరాలు, అవయవాల అమ్మకం, బయటికి రాకూడదనే ఉద్దేశపూర్వకంగానే వైద్య విద్యార్థిని హతమార్చడం కోసం అత్యాచారం చేశారని అనుమానం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పై మూకుమ్మడి దాడిని ప్రోత్సహించిన రాజకీయ నాయకులను,దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దోషులు ఎంతటివారైనా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ .చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పంది కాళ్ళ మణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, జిల్లా అధ్యక్షురాలు, ఎస్.శ్రీలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు, ఎపిఎండిసి జెఎసి పోరాట కమిటీ కన్వీన రేకులకుంట వెంకటేష్, సిఐటియు ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, సిఐటియు సహాయ కార్యదర్శి, ఎన్ఆనంద్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, సి వేణుగోపాల్, ఎం సుబ్బరాయుడు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్ యూనియన్, ప్రాజెక్టు అధ్యక్షురాలు, ఎన్.రమాదేవి, కోశాధికా జి.పద్మావతి, లీలావతి, మునీంద్ర, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ బి.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బొజ్జ శివయ్య , ఐకెపి యూనియన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.





రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, మహిళలు





మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న జెవివి, ఐద్వా నాయకులు



రైల్వేకోడూరులో నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

# అధికారుల నిర్లక్ష్య వైఖరే అక్రమ మైనింగ్‌కు కారణం

### సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

**ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్**

పక్కా ఆధారాలతో ఇసుక, మట్టి అక్రమ నిల్వలు పట్టించినా మదనపల్లి అధికారులు స్పందించడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో నిల్వ ఉంచిన ఇసుక స్థావరాలను చూపించడం కోసం పట్టణంలో పర్యటనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ బసినికొండ దగ్గర రెండు చోట్ల, ఎస్‌బిఐ కాలనీ ఒక చోట ఉన్న ఇసుక స్థావరాలను కనిపెట్టి అధికారులకు పిర్యాదు చేశారని వివరించారు. మైనింగ్ అధికారులకు ఫోన్ చేసినా స్పందించలేదని, మదనపల్లి తహశీల్దార్‌కు తనకు సంబంధం లేదని భాద్యతా రాహిత్యంగా మాట్లాడినట్లు వివరించారు. సెబి అధికారులు ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదని, రెండవ పట్టణ పోలీసులు స్పందించినా ఇసుక నిల్వలకు తమకు సంబంధం లేదని వాహనంలో ఉంటేనే సీజ్ చేస్తామని చెప్పారని అన్నారు. తహశీల్దార్ మైనింగ్ మాఫియాపై మెతక వైఖరితో ఉండటం అనేక అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. బార్లపల్లి, భువనేశ్వరి గుడి పక్కన, బైపాస్ రోడ్డు, బసినికొండ తదితర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ చేసి ఇసుక, మట్టి నిల్వలు ఉన్నాయని చెప్పినా స్పందించలేదని, మదనపల్లి సబ్ కలెక్టర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, వారు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని ఫలితంగా బార్లపల్లి వద్ద ఉన్న ఇసుక నిల్వలు మాత్రమే సీజ్ చేశారని, అదీ ప్రజలకు తెలుపలేదని, మిగిలిన నిల్వల జోలికి వెళ్లలేదంటే మాఫియా డాన్‌లను కాపాడటమే లక్ష్యంగా తహశీల్దార్ ఉన్నారని ఆరోపించారు. మైనింగ్ మాఫియా ఆగడాలు అరికట్టాలి అంటే ప్రజా ఉద్యమమే పరిష్కారం అన్నారు. అందుకు సిపిఎం అగ్రభాగాన ఉంటుందని ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయుకులు హరిశర్మ, చిన్నికృష్ణ పాల్గొన్నారు.



అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

# జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు నిర్వహించండి

**ప్రజాశక్తి-రాయచోటి**

జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించాలని డిఇఒ శివ ప్రకాష్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఉదయం తన కార్యాలయంలో జాతీయ అంతరిక్ష దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయాన్ని గుర్తుచేసుకోవడానికి భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. అన్ని పాఠశాలలు, శిక్షణా సంస్థలలో విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు, ఉపన్యాసాలు నిర్వహించాలని పేర్కొన్నారు. చంద్రయాన్‌పై 10 ప్రత్యేక పుస్తకాలు, 13 ప్రాంతీయ భాషలలో రూపొందించారని అన్నారు. ఇవి జాతీయ డిజిటల్ లైబ్రరీ భారత్ ఆన్ ది మూన్ ,దీక్ష వేదికలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని ఉపాధ్యాయులు చదివి, విద్యార్థులు చదివేటట్లు ప్రోత్సహించాలన్నారు. భారత్ ఆన్ ది మూన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడానికి వివిధ కార్యకలాపాలలో పాల్గొనడానికి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. అంతరిక్ష సంబంధిత కార్యకలాపాలపై అవగాహన పొందిన తర్వాత అన్ని పాఠశాలలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, చంద్రయాన్ నమూనా తయారీ, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. చంద్రయాన్ విజయంపై జాతీయ విద్యా పరిశోధనా సంస్థ రూపొందించిన వీడియోను జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలలలో ప్రదర్శించాలని తెలిపారు. అంతరిక్ష పరిజ్ఞానం కలిగిన ప్రముఖ వ్యక్తులను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఎడి ప్రసాద్ బాబు, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.





పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సిఐ గురునాథ్

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కలకడ సిఐ గురునాథ్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, డ్రగ్స్ వంటి అనర్థాలు, మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని పేర్కొన్నారు. ట్రిబుల్ రైడింగ్ చేయరాదని, విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యనభ్యసించాలని తెలిపారు. తల్లిదండ్రులు అధ్యాపకులు చెప్పిన విషయాలను అనుసరిస్తూ అభివృద్ధి వైపు నడవాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే 100, 1930 నంబర్లకు తెలిపితే తగిన చర్యలు తీసుకొని రక్షణ కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ జయభారతి, వైస్ ప్రిన్సిపల్ రమణయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ పుష్పకుమారి, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యలు మానుకోండి : వైసిపి

ప్రజాశక్తి-పీలేరు

టిడిపి నాయకులు రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడకుండా పీలేరు పంచాయతీ అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందివ్వాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పీలేరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవినీతి ఆరోపణలపై స్వయంగా తానే కలెక్టర్, డిపిఒలకు ఫిర్యాదు చేసి, తనతో పాటు, తాను సెలవులో ఉండగా 11 నెలల కాలం సర్పంచ్‌గా ఉన్న షేక్ జీనత్ షఫీపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. తాను తన పదవీ కాలంలో ఎక్కడా, ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, అభివృద్ధి పనులకు చేసిన చెల్లింపులు అన్నీ కూడా ఎంబుక్ ఆధారంగానే చేసినట్లు పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలోనూ పారిశుధ్య కార్మికులతో కలిసి పట్టణ ప్రజలకు ఎప్పటికప్పుడు అత్యవసర సేవలు అందించి, బెస్ట్ సర్పంచ్‌గా పురస్కారాన్ని అందుకున్నట్లు చెప్పారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు కూడా తాను సిద్ధమని అన్నారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఫోటో పంచాయతీ కార్యాలయంలో పెట్టడం తప్పా అని ప్రశ్నించారు. టిడిపి కార్యకర్తలు పంచాయతీ కార్యాలయంలోకి చొరబడి ఎంపీ ఫోటోను ధ్వంసం చేసి, అల్లరి చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు నారే వెంకటరమణారెడ్డి, విక్రమ్ వెంకటరమణారెడ్డి, ఉదయ్‌కుమార్, రమణ, శ్రీనాథ్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, హరీష్, అల్లాబక్ష పాల్గొన్నారు.

## చర్చి బాధితులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని ఎస్ఎల్ఎస్ చర్చి ప్రాంగణంలో మిషనరీల బంగ్లాను కూల్చి వేశారు గొర్రె ఇబ్బందులు పడుతున్న బాధితులకు తాము అండగా ఉంటామని వైసిపి ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం చర్చి బంగ్లాను ఆయన పరిశీలించి బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో దశాబ్దాలుగా చర్చి ప్రాంగణంలో నివాసముంటున్న బాధితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని,అర్థరాత్రి సమయంలో దాడులు చేయడం సబబు కాదని అన్నారు. చర్చి భూములను తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముకునే దురుద్దేశంతో ఈ దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్పీ, డిఎస్పీలతోనూ చర్చించి బాధితులకు న్యాయం జరిగేటట్లు చూస్తామని అన్నారు. కార్యక్రమంలో భరత్, సర్పంచ్ హరికృష్ణరెడ్డి, సిహెచ్ రమేష్, నాగేంద్ర, ఉదయ్ హేమంత్ రెడ్డి, చర్చి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు.. ప్రగతికి మలుపు

ప్రజాశక్తి-పీలేరు

ఇంధన పొదుపు ఆర్‌టిసి ప్రగతి ముడిపడి ఉందని పీలేరు డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. పీలేరు డిపోలో ఆర్థర్ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. 2024 జూలై నెలలో అత్యధిక ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లకు నగదు బహుమతులు అందించారు. ఇందులో బిఆర్ నాయక్ ప్రథమ బహుమతిగా రూ.500లు, గోవింద ద్వితీయ బహుమతిగా రూ.300లు నగదు చెక్కు రూపంలో అందుకున్నారు. డిపో మేనేజర్ ఇప్పటిని సత్కరించి బహుమతులను ప్రదానం చేశారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన డ్రైవర్లు ఇంధన పొదుపు కోసం కృషిచేసి డిపో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదుపై బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి మండలంలో ఇంటింటి సర్వే చేసి ఓటరు జాబితా పరిశీలన పక్కాగా చేపట్టాలని ఇడిటి మౌలాలి బిఎల్ఒలకు సూచించారు. బుధవారం ఆయన బిఎల్ఒలతో ఓటర్ నమోదు పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో గ్రామ ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల సంఖ్య చిరునామా ఇతర వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. మార్పులు చేర్పులు డబుల్ ఎంట్రీలు డెలీట్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని పేర్కొన్నారు.18 సంవత్సరాలు నిండిన యువత యువకులకు ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులదేనని అన్నారు. కార్యక్రమంలో డిటి ఇషాక్, బిఎల్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్త్రీ నిధి రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

స్త్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించాలని ఏరియా కోఆర్డినేటర్, స్త్రీ నిధి ఏ.జి.యం. శ్రీనివాసులరెడ్డి,ఉదయ్ లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రామ సమాఖ్యల సిబ్బంది సమీక్షించారు.గడికోట లోని 2 విఓ లు,ఒంగిమల్ల గ్రామ సమాఖ్య 2 మరియు 5,ఈడిగపల్లి విఓ,గుర్రాప్పగారిపల్లి 2,సానిపాయ విఓ1 లనుండి సుమారు 20 లక్షల రూపాయలు మొండి బకాయిలు ఉన్నందున 4 కోట్ల రుణ సౌకర్యం కోల్పోతున్నారనాని అన్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు బకాయిలు చెల్లించని ఎడల చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఏపియం ఖాదర్ వలి,సీసీలు కృష్ణయ్య,నాగేంద్ర,శుభద్రమ్మ, కులయప్ప, స్త్రీనిధి మేనేజర్ హరీష్, విఒఎలు, అకౌంటెంట్ మరియమ్మ పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీల బలోపేతమే లక్ష్యం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలికిరి

గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతమే లక్ష్యంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు పనిచేయాలని ఎంపిడిఒ గంగయ్య సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులు పాటు నిర్వహించే రిఫ్రెష్మింగ్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పై దృష్టి సాధించాలని, తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం టిఒటిలు శేషగిరికుమార్, రవి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అధికారాలు, విధులు, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ, చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాల నిర్వహణపై మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలను సర్పంచ్‌లు, కార్యదర్శులు సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి పరుశురాం, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**కలకడ :** మండల కేంద్రంలో కలకడ మండల పరిషత్ కార్యాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎంఒటిలకు జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిసినట్లు ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక వనరులను ఏ విధంగా ఉపయోగించుకోవాలి, పంచాయతీకి నిధులను ఏ విధంగా తీసుకురావాలి, ఇంటి పన్నులను ప్రతి పంచాయతీ నందు తప్పకుండా వసూలు చేయడంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించేటువంటి గ్రామ సభలను, గ్రామపంచాయతీ సమావేశాలను తప్పక నిర్వహించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం గ్రామపంచాయతీలో నాలుగు గ్రామ సభలు తప్పక నిర్వహించాలని, ప్రతినెల ఒక గ్రామ పంచాయతీ సమావేశం నిర్వహించాలని సూచించామన్నారు పంచాయతీకి అభివృద్ధి ప్రణాళిక అనేది చాలా ప్రాధాన్యత చేకూరుతుందని వాటిని తయారు చేసుకునే భాధ్యత ప్రతి పౌరుడికి ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఎంఒటిలు పాల్గొన్నారు.



కలికిరి: సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎంపిడిఒ గంగయ్య

## 'మిట్స్'లో మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె



డాక్టర్ అనుపమను సన్మానిస్తున్న మిట్స్ అధ్యాపకులు

అంగళ్ల సమీ పంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మహిళల ఆరోగ్యం, పరిశుభ్రత భద్రత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమాన్ని బిహేవియరల్ థెర పిస్ట్ డాక్టర్ టి. అనుపమ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్యం, భద్రత అనేవి మూడు ప్రధాన అంశాలపై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టాలని అన్నారు. ముఖ్యంగామహిళలు వీటిని అనుసరయించాలని తెలిపారు.వ్యక్తిగత ఆరోగ్యం పాధాన్యం, మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం ప్రాముఖ్యత గురించి అనుపమ విద్యార్థినులతో చర్చించారు. మహిళలు మానసికంగా కుంగిపోయి ఆందోళన చెందుతున్నారని అన్నారు. చదువు, పని భారం, ఒత్తిడితో చిన్న చిన్న తప్పులు చేసి కన్నీళ్లు పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. సుదీర్ఘకాలంగా ఈ పనులను చేస్తూ సతమతం కావడంతో మహిళలు తీవ్ర ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. ఒత్తిడిని నివారించాలనుకుంటే, ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఆరోగ్య కరమైన ఆహారాన్ని చేర్చుకోవాలని అన్నారు. మీసమస్యను మరింతగా పెంచే ఆహారాలను తీసుకోకుండా ఉండడం కూడా ముఖ్యమని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. పి.రామనాథన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ చొక్కనాథన్, కో-ఆర్డినేటర్లు ఆర్.ధనలక్ష్మి డాక్టర్ కె. హేమలత పాల్గొన్నారు.

## త్యాగమూర్తి శర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని జ్ఞానోదయ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం కాలధర్మం చెందిన పురాణం త్యాగమూర్తిశర్మ సంస్మరణ సభ జరిగింది. బుధవారం ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు అధ్యక్షతన, కథా నవలా రచయిత టిఎస్ఎ. కృష్ణమూర్తి వ్యాఖ్యాతగా జరిగిన ఈ సభలో పలువురు మాట్లాడుతూ త్యాగమూర్తి శర్మ విద్య, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సేవలను గురించి వారితో తమకున్న అనుబంధా లను గూర్చి వివరించారు.పట్టణంలో ఏదేని కూడలిలో త్యాగమూర్తిశర్మ విగ్రహం ప్రతిష్ఠించాలని, ప్రతి ఏటా వారి పేరిట పండితునికి పురస్కార ప్రదానం చేయాలని సూచించారు. విద్యార్థిదశలో త్యాగమూర్తి శర్మ మిత్రుడైన విశ్రాంత బ్యాంకు డైరెక్టర్ వై.శ్రీనివాసులు రెడ్డి విగ్రహానికి అయ్యే ఖర్చు తాను అందిస్తానని ప్రకటించారు. మురళీధరరావు తాము విగ్రహ ప్రతిష్టాపన కోసం పదివేలు ఇస్తామని చెప్పారు. ప్రొఫెసర్ బి.శ్రీనివాసులు, మురళీధరరావు,వి.యం.నాగరాజ కమిటీగా ఏర్పడి విగ్రహ ఏర్పాట్ల పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిఇఒ ప్రొఫెసర్ కె.నరసింహులు, జోళపాలెం భవానీ ప్రసాద్, చైతన్య భారతి సంపత్ కుమార్, పండిత వాసా కృష్ణమూర్తి, రిటైర్డ్ మున్సిపల్ మేనేజర్ వైద్యం రామకృష్ణ, సూర్యనారాయణ, విశ్వనాథరావు, జి.రామ్మోహన్‌రెడ్డి, కొడవటి ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముని గోపాలకృష్ణ, ప్రజా చైతన్య స్రవంతి కార్యదర్శి ధర్మాధిపతి నాగభూషణ రావు, కమిటీ సభ్యులు ఆలూరి సురేష్, ఎన్.శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపూడి తిరుపతిరావు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

## గ్రామ సభ ఏర్పాట్లను పరిశీలించిన 'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఈనెల 23న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మైసూరువారిపల్లెలో నిర్వహించబోయే గ్రామ సభకు హాజరుకానున్న సందర్భంగా ఏర్పాట్లను నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. గ్రామసభ నిర్వహించబోయే వేదికను ఆయన పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ గ్రామ సభలో మైసూరువారిపల్లె పంచాయతీకి సంబంధించిన వారు మాత్రమే ఉండే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ నాయకులు, సర్పంచ్ కారుమంచి సంయుక్త, తాతంశెట్టి నాగేంద్ర పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, జోగినేని మణి, గునిపాటి రాయుడు, కల్లాచలపతి, సుబ్బరాయుడు, భానుప్రకాష్ నవీన్ పాల్గొన్నారు.

**రామపురం :**డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఒకరోజు జరిగే గ్రామసభను మండలంలో విజయవంతం చేయాలని ఎంపిడిఒ, ఉపాధి హామీ ప్రాజెక్టు అధికారి సూర్య నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో 23న పంచాయతీరాజ్ శాఖ గ్రామాలలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించే గ్రామ సభలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ఎజెండా అంశాలను చర్చించి ఈ ఆర్థిక సంవ త్సరంలో గ్రామంలో చేపట్టే ఉపాధి పనుల గుర్తించి తీర్మానం చేయాలన్నారు. ఈ గ్రామ సభలకు ప్రజలు హాజరై కూలీలకు కావలసిన పనులను చర్చించాలని అన్నారు. గ్రామ సభలకు నోడల్ అధికారులు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారని, మండల స్పెషల్ ఆఫీసర్లు అన్ని గ్రామసభలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

## లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-పీలేరు

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాలు నివారించడానికి తగు జాగ్రత్తలు తీసుకుని వాహనాలు నడపాలని పీలేరు ఎస్ఐ బాలక్రిష్ణ నాయుడు తెలిపారు. బుధవారం పీలేరు పట్టణంలోని ఫైరోజ్ ఫంక్షన్ హాల్లో ఆటో యూనియన్ లీడర్ బోడేషావలి ఆధ్వర్యంలో బిస్మిల్లా ఆటో యూనియన్ సమావేశం జరిగింది. ఆ సమావేశానికి ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం మనం తరచూ చూస్తున్నామని అన్నారు. కాలం విలువైందని, ప్రాణం అంతకన్నా విలువైనవని వాహనాలు నడపడంలో తగు జాగ్రత్తలు పాటించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులకు సహకరించాలని, ప్రయాణికులతో గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో పొగ త్రాగడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, గుట్కా లాంటి మత్తు పదార్థాలు తినడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం వంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఆటో డ్రైవర్ విధిగా లైసెన్స్, యూనిఫామ్, ఆర్సీ, పోలీస్ నెంబర్ ఉంచుకుని వాహనాలు నడపాలని తెలియజేశారు. యూనియన్‌నాయకులు రత్నకుమార్, మురళీధర్, హుమయూన్, చిరంజీవి, ఆటోడ్రైవర్ పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**ప్రజాశక్తి-వీరబల్లి :** ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ డికెఆర్ డిగ్రీ కళాశాలలో ప్రజా చైతన్య సేవ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ మీకు తెలుసా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పిసిఎస్ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసు కోవాలనే అంశాలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించే విధంగా సహకరించాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధి, సుఖ వ్యాధుల వివరాలను తెలిపారు. విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకొని సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిం చాలని కోరారు. కండోమ్ ఉపయోగాలు, ఎయిడ్స్ యాక్ట్ 2017 ఎఆర్‌టి మందులు, ఎపి ఎస్ఎసిఎస్ యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 1097 తెలిపారు. కార్యక్రమంలో, కళాశాల సిబ్బంది గీత, అంజలి, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు .**రాయచోటి :** హెచ్ఐవిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని డిఆర్‌పిఎస్ అల్లావలి, ఎపిఎం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుదవారం స్వయం సహాయక కార్యాలయంలో మహిళలకు మీకు తెలుసా అనే నినాదంతో హెచ్ ఐ వి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవి కేవలం అరక్షిత లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తము ద్వారా, గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. హెచ్ఐవి పట్ల ఎటువంటి సందేహాలు, అనుమానాలు ఉన్నా ఉచిత హెల్ప్ లైన్ 1097 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, లింక్ వర్కర్స్ , మహిళలు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సంఘానికి రూ.20 వేలు విరాళం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్:** ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం మంగళవారం ఏలూరు జిల్లాలోని ద్వారక తిరుమలలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి, ప్రధాన కార్య దర్శి రామచంద్రరావు, కోశాధికారి మదన్ మోహన్‌రెడ్డి, వమహిళా అధ్యక్షు రాలు కొండా నిర్మలా, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.ముని గోపాలకృష్ణ, ఇన్ ఛార్జి ప్రెసిడెంట్ సత్య నారాయణ, ఉమామహేశ్వర్ తదితరులు హాజర య్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర సంఘాన్ని బలోపేతం చేయాలని అందుకు సభ్యులందరు కలసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్మనెంట్ ప్రివిలేజ్ మెంబర్స్ ముందుకు రావాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మునిగోపాల కృష్ణ, జిల్లా మహి ళా కమిటీ సభ్యురాలు ధనలక్ష్మిలు సంయుక్తంగా రాష్ట్ర కమిటీకి రూ.20 వేలు నగదు విరాళంగా అందించి పర్మనెంట్ ప్రివిలేజ్ మెంబర్ అయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు ధనలక్ష్మి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉమా మణేశ్వర్, సాగర్, వెంకట రమణ, ప్రకాష్‌రావు, ప్రసాద్, మంగపతి, సత్య నారాయణ పాల్గొన్నారు. ముని గోపాలకృష్ణకు జాతీయ స్థాయి ఎన్టిఆర్ లెజెండరీ నంది అవార్డు-2024 అందుకోవడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.

## అనుమతులు లేని నర్సరీలపై చర్యలు

ప్రజాశక్తి-కలికిరి



నర్సరీ యజమానికి నోటీసు ఇస్తున్న సుకుమార్‌రెడ్డి

మండలంలో అనుమతులు లేకుండా నర్సరీలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హార్టికల్చర్ ఆఫీసర్ సుకుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం నర్సరీలకు లైసెన్సులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలోని 23 నర్సరీలు ఉన్నాయని, ఇందులో 21 నర్సీలకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేయడమైనదని, .లైసెన్స్ లేని రెండు నర్సరీలకు నోటీసులు అందించినట్లు తెలిపారు. లైసెన్సు లేని నర్సరీలు 15 రోజుల లోపల లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. నర్సరీ యజమానులు అంతా తప్పకుండా స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్ కలిగి ఉండాలని, రైతులకు బిల్లులు ఇవ్వాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను మరి ముఖ్యంగా బొప్పాయి లోని జి 15 రకాన్ని సాగు చేయకూడదని తెలిపారు. ఎవరైనా నర్సరీ యజమానులు జి 15 రకాన్ని నర్సరీలలో పెంచినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గాలికుంటు వ్యాధికి టీకా తప్పనిసరి

### -పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధికి టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. బుధవారం రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టావాండ్లపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సాధారణంగా పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణకు పశు వైద్యుల సూచనలను పాడి రైతులు తప్పక పాటించాలన్నారు. పశువులలో గిట్టల మధ్యలో పండ్లు, నాలుక పై బొమ్మలు రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. దీని వలన పశువులు మేత మేయక బక్క చిక్కిపోయి అనారోగ్యం బారిన పడుతాయన్నారు. పాడి రైతులు అపోహలు వీడి ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలను వేయించాలని సూచించారు. గాలి కుంటు వ్యాధి వైరస్ ద్వారా వ్యాంస్తుందని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. సెప్టెంబర్ 18వ తేదీ వరకు ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పాడి రైతులు అపోహలు వీడి పశువులకు గాలికుంటు వ్యాధి టికాలను వేయించి విలువైన పశువులను కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గురురాజ్, గుర్రప్ప, హరి పాల్గొన్నారు.

## విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

**ప్రజాశక్తి-సంబేపల్లి :**విద్యార్థులు చిన్ననాటి నుంచే ఇతరులతో పోటీ పడినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6,7,8 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రపంచ అట్లాస్ పుస్తకాన్ని క్షుణంగా చదివి అర్థం చేసుకోవడం ద్వారా ప్రపంచ విహంగ వీక్షణాన్ని చేయవచ్చన్నారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** అమ్మచెరువు మిట్టలో గల వెలుగు సంస్థలో జాతీయ వృద్ధుల దినోత్స వం సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సాయి నమన ఎంటర్‌ప్రైజెస్, వాటర్ ప్రూఫింగ్ కాంట్రాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఆయన సతీమణి సునీత, వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డిలు హాజరయ్యారు. వెలుగు వృద్ధా శ్రమం లోజరిగిన కార్యక్రమంలో సోషల్ వర్కర్ గీత మాట్లాడుతూ వృద్ధులందరికి జాతీయ వృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాప్యం అనేది మనిషికి పసితనం వంటిదని చిన్న పలకరింపు కోరుకొనే వయస్సు వారిదని, ఆత్మీయ స్పర్శ కోసం పరితపించే మనసు వారిదని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ వృద్ధాప్య దశని అనుభవించి తీరుతారన్నారు. కాంట్రాక్టర్ నారాయణ రెడ్డి వారి సతీమణి సునీతల 17వ పెళ్లి రోజును పురస్కరించుకొని కేక్ కట్ చేయగా వెలుగు సిబ్బంది, చిన్నారులకు, వృద్ధులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మీ, సోషల్ వర్కర్ గీత, వెలుగు సిబ్బంది

## ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తా : సిఐ

**ప్రజాశక్తి-గాలివీడు :** పోలీసులు అంటే ప్రజల్లో నమ్మకం కలిగించి వ్యవస్థ పైన గౌరవాన్ని పెంపొందిస్తామని లక్కిరెడ్డిపల్లి సిఐ వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మొదటిసారిగా గాలివీడు పోలీసుస్టేషన్ ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసుల పూర్వపరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండ లంలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థినిలు ఆత్మహత్యకు పాల్పడకుండా వారికి కావలసిన కౌన్సిలింగ్ ఇచ్చి వారిని చైతన్య వంతులు చేస్తామన్నారు. ప్రజలతో కలిసిపోయి ప్రభుత్వ ఆదేశా నుసారంగా జిల్లా అధికారుల సూచనల మేరకు తమ విధులు నిర్వహించి ప్రజలకు అందు బాటులో ఉంటామని అన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎఎస్ఐ అంజిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, శ్రీరాములు నాయక్, కానిస్టేబుల్ షఫీ, కాంతారావు, మదన్మోహన్, వేణు, ఇరుగంరెడ్డి, అల్తాఫ్ పాల్గొన్నారు.

## ములకలచెరువు సిఐగా రాజారమేష్

**ప్రజాశక్తి-ములకలచెరువు :** ములకలచెరువు సిఐగాగా రాజా రమేష్ బుదవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ మధు రాయచోటి విఆర్‌కు బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో సత్యసాయి జిల్లా కొత్తచెరువులో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. సిఐకు ఎస్ఐ గాయత్రి, స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిబ్బంది ఎఎస్ఐలు నగర్, భాస్కర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, శంకర్‌నాయక్, రమణ, విజయ్‌కుమార్, కానిస్టేబుల్‌లు హరి, సిరాజ్, నాగిన్, నరసింహులు పాల్గొన్నారు.

## తాగునీటి బోరుకు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలి

**ప్రజాశక్తి-గాలివీడు :** మండలంలోని అరవీడు పంచాయతీ ఎల్లంపల్లికి చెందిన ప్రజలు తాగునీటి బోరుకు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని కోరుతూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించినట్లు సత్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో 80 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నామని తాగునీరు ఉండి కూడా ట్రాన్స్‌ఫార్మర్ లేక నిటి సమస్యతో బాధపడుతున్నామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో శివప్రసాద్, లక్ష్మయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## బైక్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు : ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్:** ఆర్‌టిసి బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మదనపల్లె తాలూకా సిఐ కళావెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. వాల్మీకి పురం పట్టణం పింగాణే కాలనీకి చెందిన ఈశ్వరయ్య(36), అతని దగ్గరి బంధు వైన నరసింహులు (65) సొంత పనిపై ద్విచక్ర వాహనంలో బుధవారం ఉదయం మదనపల్లెకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలోని, కొత్తవారిపల్లి పంచాయతీ పూలవాండ్లపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఈశ్వ రయ్య, నరసింహులును స్థానికులు 108లో మదనపల్లె జిల్లా అస్పత్రికి తరలిం చారు. వైద్యులు పరీక్షించి తిరుపతికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు చేసిదర్యాప్తు చేస్తామని తెలిపారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి -బి.కొత్తకోట:** కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బి.కొత్తకోట పోలీసులు అరెస్ట్ చేశారు. ఎఎస్ఐ బొజ్జ నాయక్ కథనం మేరకు వివరాలు..బుధవారం ఉదయం 7గంటలకు మండలంలోని సూరపువారిపల్లి పంచాయతీ, కొత్త వడియంలో మేకల రెడ్డెప్ప కుమారుడు లక్ష్మీనారాయణ తన ఇంటి వద్ద కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా బి.కొత్తకోట పోలీస్ స్టేషను సిఐకి వచ్చిన సమాచారం మేరకు ఆపల్లెకి వెళ్లి నిందితుడి వద్ద ఉన్నటువంటి పది లీటర్ల పరిమాణం కలిగి (115) కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## విషద్రావణం తాగి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-పుల్లంపేట :** మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి గ్రామానికి చెందిన కసిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి(51) అనారోగ్యంతో బాధపడుతూ పురుగులు సేవించి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటక్రిష్ణారెడ్డి చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడని తెలిపారు. షుగర్, నరాలకు సంబంధించిన వ్యాధులతో తీవ్రంగా బాధపడుతూ ఈనెల 18న జీవితంపై విరక్తి చెంది ఉడుమువారిపల్లిలో గల తన తోటలో గడ్డి మందు తెచ్చుకుని సేవించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని రాజంపేట ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.